# ఆఖరి లేఖ

రచన:
శ్రీ చింతూరి మల్లిబాబు

మానసికంగా, దైహికంగా బాగా అలసిపోయి, శాంతి కోసం తపిస్తున్న సమయంలో, ప్రతిమ నాకు పరిచయం అయింది. చీకటిని తరిమి వెన్నెల కురిపించే చంద్రరేఖలా, మండుటెండలో - ఎడారి మధ్యలో సేద తీర్చి జీవాలు నిలిపే ఒయాసిస్సులా అనిపించింది ఆమె. అరవిరిసిన సోయగం ఆమెది. పొడవూ, ఆ పొడవుకు తగ్గ దేహసౌష్ఠవం ఆమె అందానికి, హుందాతనానికి నిదర్శనం. ఆ విశాలమైన నల్లని కళ్ళలోని తళుకు - కవ్వింపు - సౌందర్యం, ఆ సున్నితమైన పెదాల మీద కొంటెగా, కోమలంగా తేలిపోయే చిరునవ్వులోని తీయదనం - ఆకర్షణ నన్ను పదే-పదే గాఢంగా ఆకట్టుకుని, నా మనస్సునీ - మేధస్సునీ ఆమె తన వశం చేసుకుంది.

ఆమె కింతగా నా హృదయం దాసోహమై పోయిందని గానీ, ఇంతగా నాపై ఆమె ప్రభావం ప్రసరిస్తోందని గానీ, ఎంతో కాలానికి గానీ తెలుసుకోలేక పోయాను. కాని అప్పుడు ఆమె ఆకర్షణ నుంచి తప్పించుకోవడం ఇంక అసాధ్య మనిపించింది. అందుకే నా వ్యక్తిత్వాన్ని, నా ఉనికిని మరచి ఆమె చుట్టూ పరిభ్రమించ సాగాను.

* * *

ప్రతిమకూడా నాకు అనుగుణంగా ప్రతిస్పందిస్తున్నట్టే కనిపిస్తోంది. కాని అంతా అస్పష్టం. నేను కనిపించినప్పుడు అదోలా ఆత్మీయంగా నవ్వేది. అవకాశం లభించినప్పుడు స్వల్పంగానే అయినా ఆప్యాయంగా, హాయిగా మాట్లాడేది. అంతేగాని, అంతకు మించి అతి చనువు తీసుకునే అవకాశం నాకు గానీ, ఆమెకు గానీ అంతగా ఉండేది కాదు. మా ఇద్దరికీ ఉండే పరిమితులు అట్లాంటివి. చుట్టూ వుండే అభ్యంతరాలు అటువంటివి.

స్త్రీ సహజమైన సంకోచం, అస్వతంత్రత ఆమెని అలా హద్దు మీరకుండా వుంచేవి కాబోలు. ఆమెని అలా నవ్వుతూ, కవ్విస్తూ, అంతా అందకుండా, అద్భుతంగా, అపురూపంగా, సన్నిహితంగా సంచరిస్తూంటే నా హృదయం విల-విల లాడిపోయేది. ఒక్కసారి ఆమెని తనివిదీరా కౌగిట్లోకి తీసుకుని, హృదయానికి గాఢంగా హత్తుకోవా లనిపించేది.

కాని ఆమె అపార్థం చేసుకుని. అవమానిస్తే ఎంత బాధ? ఇంతకాలం చెక్కు చెదరకుండా వున్న తీయని ప్రేమస్వప్నం పూర్తిగా కరిగి పోదా? అప్పు డెంత అశాంతి? ఎంతటి ఆశాభంగం! అందుకే ఇంత కాలమైనా దూరం నుంచే ప్రతిమని ఆరాధిస్తూ, ఆనందిస్తూ వస్తున్నాను.

కాని ఈ పరిస్థితి రోజు రోజుకూ అసహనంగా వుంది నాకు. ఆమెను ఒక్కరోజు కూడా చూడకుండా ఉండలేక పోతున్నాను.

ఆమెచూపు నాకు సంతృప్తి. ఆమెనవ్వు నాకు అమృతం!

అయితే ఇలా ఎంతకాలం జరుగుతుంది? ఏదో ఒక నాడు ఆమె యిక్కడ నుంచి అదృశ్యమై పోతే నా హృదయం ఏమై పోతుంది? నిజంగా బ్రద్దలై పోదా? అందుకు ఆ పరిస్థితి రాకూడదని వేయి దేవుళ్ళకు మ్రొక్కుకొంటున్నాను.

ఎప్పటికీ నా ప్రతిమ నాకు సన్నిహితంగా, అలా నవ్వుతూ కవ్విస్తూనే వుండాలని ఆశిస్తున్నాను. కాని ఈ ఆశ సఫలమవుతుందా?

నాకు ఆమెపై ఉన్నంత ఆకర్షణా, అనురాగమూ ఆమెకి నా పట్ల వుండవద్దా? ఏమున్నా లేకున్నా కనీసం నా పట్ల, నా ఆరాధన పట్ల ఆమెకి సానుభూతి మాత్రం ఉండి తీరుతుందని నాకు నమ్మకం వుంది. అది చాల జీవితాంతం మధురమైన అనుభూతితో, నిశ్చలమైన కాంతితో బ్రతకడానికి. ఇదీ నా ప్రస్తుత మనోభావన; ప్రతిమ పట్ల, ఆమె ప్రేమపట్ల నా దృక్పథం. అంతకు మించి అధికంగా వాంఛించడం, ఆవేదన చెందడం అత్యాశే ననిపించింది.

* * *

ప్రతిమ కొత్త అందాలు సవరించుకొంటూ, వోణీ సవరించుకొంటునప్పుడు, ఓ ప్రశాంతమైన సంధ్యవేళలో నాకు సాక్షాత్కరించింది అసాధారణంగా! ఆమె సోయగాన్ని అభినందిస్తూ, ఓ చిరునవ్వు నవ్వాను. దానికి సమాధానమా అన్నట్లు వొయారం పోతూ ఒక దరహాసం చిందించింది ప్రతిమ. అంతే....అప్పటినుంచీ మా ఇద్దరిమధ్య ఏదో అనుబంధం అల్లుకు పోయింది.

ఆ తరువాత చాలా చోట్ల ఆమె అప్రయత్నంగా ఎదురుపడేది. ఒక్కోసారి కావాలని నేనే ఆమెకి తటస్థపడుతుండే వాడ్ని. ఇద్దరం నవ్వుకునే వాళ్ళం. ఆప్యాయంగా కొద్ది మాటలు మాట్లాడుకునే వాళ్ళం. అంతేగాని, అధికం లేదు. ఆ కాస్సేపు ఆనందంగా, అద్భుతంగా వుండేది, ఆ తరువాత ఆమె గురించే ఆలోచనా—అనుభూతులూ....

ఇలా అప్పుడప్పుడూ మాట్లాడుకోవడాలు, నవ్వుకోవడాలూ అంత సంతృప్తికరంగా, సౌఖ్యవంతంగా అనిపించేవి కావు. సదా ఆమె సాన్నిధ్యం కావాలనిపించేది. కాని సాధ్యం ఎక్కడ? కనీసం ఆమె ఫొటో అయినా నా దగ్గరుంటే, ఆమె కనిపించని సమయాల్లో ఆ ప్రతిబింబం చూస్తోనైనా ఊరట పొందొచ్చు ననిపించింది.

GIRI

IS:4984-80 ISI FINE

ISI మార్కు గల గిరివారి అత్యుత్తమమైన తయారింపులు.

* గిరి ఫస్ట్‌క్వాలిటి * గిరిటెక్స్ * గిరి కూల్‌టెక్స్ బనియన్లు

మరియు * డ్రమ్స్ & * బ్రిఫ్స్. వీటిని ఎల్లప్పుడూ వాడి ఆనందము పొందండి.

: వివరములకు :

GIRI TEX Phone: 21795

81-B, RAMAIAH COLONY - TIRUPUR - 638 602.

ఒకసారి ఆమెని అడిగాను-"నీ ఫొటో యిస్తావా?"అని. "ఎందు కివ్వను? నీకివ్వకపోతే యింకెవరి కిస్తాను?" అంది ఎంతో ప్రేమగా.

కాని ఆమె తన ఫొటో ఎంతకీ నా కివ్వలేదు. ఎప్పటి కప్పుడు ఏవో సాకులు చెప్పి యిస్తానంటూనే ఇవ్వకుండా వుండిపోయింది.

ఆమె తన ఫొటో యివ్వడానికి ఏవో అభ్యంతరాలుండి వుంటాయని సరిపెట్టుకున్నాను. ఎందుకంటే ఈ రోజుల్లో అబ్బాయిల్ని నమ్మే పనిలేదు. ప్రస్తుతం ప్రేమలు గీమలు అంటారు. అమ్మాయిల్ని ఆకట్టుకుంటారు. ఆ తరువాత వాళ్ళ గురించి బయట చౌకబారుగా ప్రచారం సాగిస్తారు. అలాగే నేను కూడా తయారై, ఆమె ఫొటో ఎక్కడైనా ప్రదర్శించి, ఏమైనా అవాకులూ, చెవాకులూ వాగుతానేమో నని ఆమె సందేహించి, తన ఫొటో నా కివ్వలేదని నాకని పించింది. అయితే నా ఉద్దేశం మాత్రం అదికాదు. ఆమె ఫొటోని ఎంతో పవిత్రంగా, మధురస్మృతి చిహ్నంగా భద్రంగా దాచుకోవాలన్నదే నా సంకల్పం! ఆమె రూపాన్ని నా హృదయంలో గుప్తంగా నిక్షిప్తం చేసుకొని, ప్రేమతో నేను పూజించుకోవాలన్నదే నా ఆశయం! కాని ఈ నా ఆదర్శం ఆమె అర్థం చేసుకునేదెలా? అనుగ్రహించేదెలా? ఈ విషయమై ఆమెకి విశదమయ్యేలా వివరించదలుచుకో లేదు నేను. ఆమెకి నా మీద ప్రేమాభిమానాలుంటే ఎప్పటి కైనా నా మనసు అర్థం చేసుకొని నన్ను తప్పకుండా మన్నిస్తుంది. అదే నా ఆశ!

ఆ తరువాత ఆమెని అట్టే కాలం చూడలేక పోయాను. నేను ఆ ఊరి నుంచి అనివార్యంగా వెళ్ళిపోవాల్సి వచ్చింది. నేను సాహసం చేయలేక పోయాను. ఆమెకు కూడా ఏదో జంకు వుంది. అంచేత ధైర్యం చేసి ఎవరమూ హృద హృదయాలు విప్పి ఒకరి మనసులోని ఒకరం చెప్పుకోలేక పోయాము.

ప్రతిమని విడిచిపోవడం నాకు ఎంతో బాధాకరంగా, ఎంతో దుస్సహంగా వుంది. అయినా తప్పదు. ఆఖరు సారిగా నా హృదయంలో చెలరేగే అలజడిని కాగితం మీద పెట్టి, ఆ లేఖని ఆమెకి పోస్టు చేశాను - నేను అక్కడి నించి వెళ్ళిపోతూ.

"ప్రియమైన ప్రతిమా!

నువ్వు నిజంగా ప్రతిమవే! మాటా మనసూ లేని శిలాప్రతిమవే! అందుకే నన్నిలా దారుణంగా బాధ పెడుతూ దూరంగా మసలుతున్నావు. కనీసం నీ ఫొటోనైనా నాకు ప్రసాదించకుండా నాతో ఇంతకాలం దోబూచులాడావు. నేను దూరంగా వెళ్ళిపోతున్నాను. నీ దర్శనం ఇక నాకు దుర్లభం. నాకు ఇక మిగిలేదల్లా అశాంతీ - అంధకారమే! నా బ్రతుకు చీకట్లోకి వెన్నెల చందమామలా వచ్చావు. ఆకాశంలోని జాబిల్లిలా అందాలు వెద జల్లుతూ, అందీ అందకుండా మురిపిస్తూ మోసం చేశావు. నేను దురదృష్టవంతుణ్ని. కలలు ఫలించ కుండానే కనుమరుగవుతున్నాను. నీ స్మృతిని నా హృదయంలో మధురస్మృతిగా దాచుకుంటాను. నీకు నిజంగా నాపై దయ వుంటే, ఎప్పుడేనా - ఎక్కడేనా కలుసుకుంటే - కష్ట సుఖాలు చెప్పు కుందాం! సానుభూతి తెలుపుకుందాం!

సదా నీ "ప్రదీప్."

Edited and Published by A.N. Raghavachar, No. 10, Murugesa Mudali St, Madras-600 079.
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47, Badrian Street, Madras-600 001.